# "ఈ కూచిపూడి కళ మనది. ఈ కళ గురించి గర్వపడే హక్కు మనది"

## డాక్టర్ వెంపటి చినసత్యంతో ఇంటర్వ్యూ



(డాక్టర్ వెంపటి చినసత్యం నేతృత్వంలో మద్రాస్ కూచిపూడి ఆర్ట్ అకాడెమీ కళాకారులు ఉత్తర అమెరికాలో 56 నగరాలలో ప్రదర్శనలిస్తున్న విషయం తానాపత్రిక పాఠకులందరికీ విదితమే. ఈ పర్యటన మధ్యలో తానాపత్రిక సహసంపాదకుడు జంపాల చౌదరితో శ్రీ వెంపటి చినసత్యం చెప్పిన విషయాలను 'ఉత్తర అమెరికాలో కూచిపూడి' ప్రత్యేక సంచిక సందర్భంగా ప్రచురిస్తున్నాం. --- సంపాదకుడు)

### పూర్వ చరిత్ర

... మా నాన్నగారు నా చిన్నతనంలోనే పోయారు. ఆయన నాట్యం నేర్చుకోలేదు, వ్యవసాయం చేసేవారు. తొమ్మిదేళ్ల వయసులో నాట్యం నేర్చుకోవడం మొదలుబెట్టాను. మద్రాసు బ్రతుకుతెరువుకోసమనే వెళ్ళాను ... మా పెత్తండ్రి కుమారుడు వెంపటి పెదసత్యం సినిమాల్లో డాన్స్ డైరెక్టర్‌గా ఉండేవాడు. అతని దగ్గర పనిచేశాను. తర్వాత స్వంతంగాకూడా డాన్స్‌డైరెక్టర్‌గా పనిచేశాను. రంగులరాట్నం, శ్రీకృష్ణసత్య, కృష్ణావతారం, ఇట్లా చాలా 20-30 సినిమాలదాకా చేశాను. ఇన్ని సినిమాలలో నాకు పూర్తిగా సంతృప్తినిచ్చిన చిత్రమంటూ ఏదీ లేదు. ఆఖరుగా అమెరికా అమ్మాయిలో ఒక డాన్స్ మాత్రం (కొరియోగ్రాఫ్) చేశాను. అదికూడా ఆ సిట్యుయేషన్ నచ్చడం వల్ల. చిదంబరం గుళ్ళో శిల్పాలు చూస్తున్న అమెరికా అమ్మాయిలో నృత్యం చేయాలన్న స్పందన వస్తుంది (ఆనందతాండవమాడే శివుడు అన్న ఆ పాట, నృత్యం అభిమానులు కలకాలం గుర్తుపెట్టుకోదగ్గవి).

... సినిమాల్లో వాతావరణం నాకు సూట్ కాలేదు. ఆత్మగౌరవం ఉన్నవాళ్ళు అడ్జస్ట్ కాలేరు. ఏవో డబ్బులొస్తాయి. బాగా సంపాదించుకోవచ్చు కాని ఆర్ట్‌కి విలువ లేదు. ఆర్టిస్ట్‌గా బ్రతకలేరు. చాలా ఫాల్స్ లైఫ్, ఫాల్స్ ప్రెస్టీజ్. అందులో ఇమడలేకపోయాను. స్ట్రగుల్ పడ్డా ఆర్టిస్ట్‌గా బతకాలని వచ్చేశాను. భగవంతుడి దయ వల్ల సక్సెస్ అయాను.

... కూచిపూడికి ఇంతకు ముందు పుస్తకాలు, సిలబస్సూ ఉండేవి కాదు. అంతా గురుకుల పద్ధతిలో గురుముఖస్థా అభ్యాసం చేసే పద్ధతి ఉండేది. మా గురువుగారు వేదాంతం లక్ష్మినారాయణశాస్త్రి గారిదగ్గర అయిదారేళ్ళు నేర్చుకొన్నాను. మహాసముద్రం లాంటిది ఆయన నాలెడ్జ్. ప్రవాహం లాగా చెప్పేవాళ్ళు. భరతనాట్యంలో హేమాహేమీలంతా ఆయన పాదాల దగ్గిర కూచిపూడి నేర్చుకొనేవారు.

... ఆడ వేషం వేసి మెప్పించగల మొగవాళ్ళు బాగా అరుదు. (వేదాంతం) సత్యన్నారాయణ శర్మలాగా అంత అందంగా, అంత పర్ఫెక్ట్‌గా ఉండద్దూ అందరూ? అట్లాంటి ఆర్టిస్ట్ దొరక్కపోతే మరి ఆడపాత్రలన్నీ ఏమైపోవాలి? మగవాళ్ళకి పరిమితం చేయడం వల్లే కూచిపూడి డాన్స్ అభివృద్ధి చెందలేదు. మా గురువుగారు ఆడవాళ్ళకి కూచిపూడి నేర్పటం మొదలుబెట్టినప్పుడు అందరూ ఆయన్ని ద్వేషించారు, తిట్టిపోశారు. అయితే ఆయన ఏం లెక్క చేసేవాడు కాదు. అప్పటికే ఆయనకు డబ్భయ్యేళ్ళు. కాలపరిస్థితులనుబట్టి మనం, మన కళ మారాలి. అయిదు వందల సంవత్సరాల క్రితం లాగానే ఇప్పుడూ ఉండాలంటే ఎలా? ఇంత సైంటిఫిక్ అభివృద్ధి ఉందే. దీన్ని







Print to PDF without this message by purchasing novaPDF (http://www.novapdf.com/)

వాడుకోపోతే ఆర్ట్‌కి విలువ లేకుండా పోతుంది.

### కూచిపూడి ఆర్ట్ అకాడమీ పుట్టుక

1961-62లో బందా కనకలింగేశ్వరరావుగారు కొత్త కూచిపూడి నృత్యనాటిక సృష్టించడానికని ఇరవై వేల రూపాయల గ్రాంట్ తీసుకున్నారు ప్రభుత్వం దగ్గర. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రేడియోకోసమని 'క్షీరసాగరమథనం' రాస్తే, బాలాంత్రపు రజనీకాంతరావు గారు సంగీతం కూర్చారు. బందా గారు వేదాంతం రాఘవయ్య గారినీ, పెదసత్యం గారినీ కొరియోగ్రఫీ చేయమని అడిగితే వారిద్దరూ తప్పుకొని 'ఇదిగో మా చినసత్యం చేస్తాడు' అన్నారు. నిరంతరం అదే సాధనలో ఏదో చేద్దామనే తపనలో ఉన్నవాణ్ణి కదా, దాంతో సరే అన్నా. బెజవాడలో, కూచిపూడిలో కూర్చుని చేశాం. నేను శివుడి వేషం వేశాను. బాగా పేరొచ్చింది. మద్రాసు కళారంజనిలో ప్రోగ్రాం చూసి శాంతారావు అనే ఆవిడ కూచిపూడి నేర్చుకోవడానికి వచ్చింది. అప్పటికే ఆవిడ భరతనాట్యం ప్రవీణురాలు. ఆవిడకు నేర్పటం కోసం నేను చాలా ప్రిపేర్ అవాల్సి వచ్చేది. అది తర్వాత అకాడమీ పెట్టటానికి దారి తీసింది.














... 1963లో అకాడమీ మొదలుపెట్టాం. నెలకు 250 రూపాయలు అద్దె ఇంట్లో. నానా అవస్థా పడేవాళ్ళం. నేనూ, నా శిష్యుడు శేషు అని ఉండేవాడు (ఇప్పుడు ప్రముఖ నృత్యదర్శకుడు) చాలా కష్టపడేవాళ్ళం. పాపులారిటీ వచ్చాక గవర్న్‌మెంట్ సంవత్సరానికి అయిదు వేలు ఇవ్వటం మొదలుపెట్టింది. 1982, 84లలో అమెరికా వచ్చాక, ఆ సక్సెస్ తర్వాత అభిమానుల ఆదరణ పెరిగింది. సెంట్రల్ గవర్నమెంట్ సంవత్సరానికి 50వేలు గ్రాంట్ ఇస్తుంది. ఇప్పుడు 'ఏ' గ్రేడ్ ఇన్స్టిట్యూషన్‌గా గుర్తింపు ఇచ్చి ఆ గ్రాంట్ లక్ష రూపాయలకు పెంచటానికి జి.ఓ. ఇవ్వబోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పుడేం లేదు. ఇప్పుడు చాలామంది హెల్ప్ చేస్తున్నారు. సంస్థ నడపటానికి ఫైనాన్సెస్‌కోసం ట్రస్ట్ ఒకటి ఏర్పాటు చేశాం. పెద్ద బిల్డింగ్, హాస్టల్ వసతితో కట్టాం. హాస్టల్, మెస్సు ఖర్చు మాత్రం నెలకు 500 రూ అవుతుంది. ఇతరత్రా ఇంకా (ట్యూషన్ ఫీజు లాంటివి) ఏమీ తీసుకోం. అందరి సహాయంతోనే అకాడమీ, వైజాగ్ ఇన్స్టిట్యూట్ (కళాక్షేత్రం) నడుస్తున్నాయి ... అకాడెమీలో పాఠాలు చెప్పేవాళ్ళకు మేం జీతంగా ఇచ్చేది తక్కువే. ప్రోగ్రాంలిచ్చినప్పుడూ, ఇలా టూర్స్‌కి వచ్చినప్పుడూ మాత్రం వచ్చిందంతా వీళ్ళందరికీ, ఆర్టిస్టులకీ ఇచ్చేశాక ఏమన్నా మిగిలితే అప్పుడది ఇన్స్టిట్యూట్‌కి. వీళ్ళందరి పోషణా చూసుకుంటేతప్ప ఆర్ట్ నిలబడదు.

... స్ట్రగుల్ అవుతుంటేనే ఆర్ట్ నిలబడుతుంది. కడుపునిండా తిండీ, కంటినిండా నిద్రా ఉంటే వళ్ళు వంగదు. (డబ్బు) దాచుకోవడం మొదలుబెడితే లిమిట్ లేకుండా పోతుంది. ఆర్ట్ నిలబడదు. చేర్చిపెట్టాననుకోండి. ఏమిటి ప్రయోజనం చెప్పండి?

### అంతర్జాతీయ ఖ్యాతి, రాష్ట్రంలో మాత్రం...

... మన ఇన్స్టిట్యూట్ పెట్టాక కూచిపూడికి చాలా ప్రాముఖ్యత వచ్చింది. అంతకు ముందు గవర్న్‌మెంట్ గుర్తింపు భరతనాట్యం, కథక్ లకే ఉండేది. పన్నెండేళ్ళుగా కూచిపూడికి కూడా రికగ్నిషన్ వచ్చింది. బ్రిజ్ మహారాజ్, కేలూచరణ్ మహాపాత్ర, నేను, మా ముగ్గురినీ దేశంలోకల్లా ప్రముఖ కొరియోగ్రాఫర్లుగా గుర్తించటం జరిగింది. మేము ముగ్గురం కలసి నేషనల్ ఇంటిగ్రేషన్ కౌన్సిల్ పథకం కింద మన (కూచిపూడి ఆర్ట్ అకాడెమీ) పారిజాతాపహరణం నాటకాన్ని తీసుకొని ఒకో భాగాన్ని ఒకో సాంప్రదాయం ప్రకారం సంగీతం, నృత్యం సృష్టించి సమిష్టిగా చేశాం. అప్పట్నించీ ప్రపంచంలో అధికారికంగా ఇండియా ఫెస్టివల్ జరిపినప్పుడల్లా మా ముగ్గుర్నే పంపిస్తుంటారు. అట్లా ఇండియా ఫెస్టివల్స్‌కి అమెరికా, రష్యా, సౌతాఫ్రికా, మలేషియా, మిడిలీస్ట్, జర్మనీ వెళ్ళాం. ... ఇప్పుడు అంతర్జాతీయంగా కూచిపూడికి గుర్తింపూ ఆదరణా బాగా పెరిగాయి. పదేళ్ల పూర్వానికీ ఇప్పటికీ తేడా స్పష్టంగా తెలుస్తోంది ఈ పర్యటనలో. ... ఇండియానాలో వాళ్ళు (జోర్డన్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుండి) ఒక బృందంగా ఇండియా వస్తాం అంటున్నారు.



Print to PDF without this message by purchasing novaPDF (http://www.novapdf.com/)

మిగతా రాష్ట్రాలలో కళలకీ, కళాకారులకీ చాలా ప్రోత్సాహం ఉంది. మన రాష్ట్రంలో కళలకి లేదు. స్టార్లకి మాత్రం ప్రోత్సాహం ఉంది ... నా ఉద్దేశంలో చదువుకొన్నవాళ్ళు, కళలంటే ఉత్సాహం ఉన్న వాళ్ళు అంతా రాష్ట్రం విడిచి ఉద్యోగరీత్యా వ్యాపారరీత్యా వేరే రాష్ట్రాలకో, వేరే దేశాలకో వెళ్ళిపోతున్నారు. మిగిలినవాళ్ళలో సగంమందికి రాజకీయాల పిచ్చి, మిగతా సగంమందికి సినిమాస్టార్ల పిచ్చి. కళలని ఆదరించేవాళ్ళు బాగా తగ్గిపోయారు. ... రిటైరైపోయిన ఎమినెంట్ ఆర్టిస్టులకి భృతిగా సెంట్రల్ గవర్నమెంట్ నెలకు వేయి రూపాయలిస్తూ గ్రాంట్ మంజూరు చేసింది. అన్ని రాష్ట్రాలకూ మంజూరు చేసింది. మన రాష్ట్రంలో ఒక్క కళాకారుడికీ ఇవ్వలేదు.

శిష్యపరంపర

... ఇప్పటిదాకా దాదాపు రెండువేలమంది పైన శిష్యులకు శిక్షణ ఇచ్చాను. దేశంలోనూ, ప్రపంచంలోనూ అన్ని మూలల నుంచీ వచ్చారు, వస్తున్నారు శిక్షణ కోసం. సావిత్రి మా స్టూడెంటే. ఇంకా ఎన్టీఆర్, జయలలిత, హేమమాలినీ ఇట్లా చాలామంది నేర్చుకొన్నారు ... ప్రస్తుతం కూచిపూడి నర్తకులలో శోభానాయుడు, మంజుభార్గవి, యామినీకృష్ణమూర్తి, మంజుభార్గవి, రాజారెడ్డి, రాధారెడ్డి మంచి ప్రతిభగలవారు. కొత్తవారిలో పద్మామీనన్, కమలారెడ్డి, శశికళ, అనూరాధ, కల్పలతిక, హేమమాలిని, విజయ, ఇంకాకొందరు కూడా మంచి ప్రతిభావంతులు. ప్రస్తుతం అమెరికాలో నేర్చుకొనేవాళ్ళు చాలామంది తపన ఉన్న వాళ్ళున్నారు , సంగీత, ఈశ్వరి, సుధ, వీణ ఇంకా కొంతమంది.

... మా అబ్బాయి రవిశంకర్, బాల అని నా శిష్యురాలు దగ్గర డాన్స్ నేర్చుకొన్నాడు. నేర్చుకొంటున్నట్లు కూడా నాకు తెలీదు. ఒక రోజున బాల తీసుకొచ్చి చూపించింది మంచి రిథ్మిక్ సెన్స్ ఉంది చూడమని. ఆ తర్వాత నా దగ్గర నేర్చుకోవడం మొదలెట్టాడు. నేను వేరే ప్రొఫెషన్ చూసుకోమనే అనేవాణ్ణి. వాడికి బాగా డాన్స్ చేయాలని ఉండడంతో ఇక ఊరుకున్నాను. వాడు స్టేజ్ మీద ప్రదర్శనలు ఇవ్వడం రెండేళ్ళనుండే.నేనైతే డాన్స్ టీచర్నే, వాడు టీచర్, పెర్ఫార్మర్ కూడా.

ఇక్కడి పిల్లలు అకాడెమీలో నేర్చుకోవాలంటే?

... ఇండియాలో కూచిపూడి నేర్చుకొంటున్న పిల్లలకూ, ఇక్కడ నేర్చుకొంటున్న పిల్లలకూ, స్టేజ్ మీద పెర్ఫార్మన్స్‌లో తేడా చెప్పలేం. అంతా ప్రాక్టీసులోనూ, ట్రైనింగ్‌లోనూ ఉంటుంది. ... రోజూ అందరికీ ఒక్కలాగే నేర్పుతాం. (సీనియర్స్‌ను) చూస్తుంటే అర్థం అవుతుంది. చూసి నేర్చుకోవచ్చు. నేర్చుకొనేటప్పుడు అందరూ ఒక్కటే. ప్రదర్శనల్లో మాత్రం టాలెంట్‌కే ప్రాముఖ్యత ఇస్తాం. ... అకాడమీలో నేర్చుకొనేవాళ్ళల్లో సగం మంది తెలుగువాళ్ళు కాదు. అన్నిచోట్ల నుంచీ వస్తున్నారు. .. రెగ్యులర్ స్టూడెంట్స్ ఎనభై-తొంభై మంది ఉంటారు. వీళ్ళల్లో 25మంది హాస్టల్లో ఉంటారు. మార్నింగ్స్ స్టూడెంట్స్ అందరూ ఒక్కలాగానే ప్రాక్టీస్ చేస్తారు. మధ్యాహ్నం నుంచి మాత్రం లెవెల్స్‌ని బట్టి ట్రైనింగ్. కూచిపూడి నేర్చుకోవటానికి సిలబస్సు సిస్టమాటిక్‌గా ఏర్పాటు చేశాం.

... అకాడెమీ లో నేను రోజూ నేర్పుతుంటాను. నాతోపాటు హేమమాలిని, మా అబ్బాయి రవిశంకర్, ఇంకో అమ్మాయి, టీచ్ చేస్తుంటారు. వీళ్ళు కాక సీనియర్ స్టూడెంట్స్ కొంతమంది కూడా నేర్పుతుంటారు. వీళ్ళు కాక సంగీతరావు గారు (వీణ), గాయని సీతాలక్ష్మి, ఫ్లూట్ నాగరాజన్, మృదంగం గోవిందరాజన్ రెగ్యులర్ స్టాఫ్. రోజూ ప్రాక్టీస్ దగ్గర వీళ్ళంతా ఉంటారు. .. ఇక్కడ నేర్చుకొనేవాళ్ళు రెండుమూడు సమ్మర్స్ (అకాడెమీకి) వస్తే సరిపోతుంది. ఆ రెండు నెలలూ రోజూ రెండు పూటలూ ప్రొద్దున్నా సాయంత్రం ప్రాక్టీసు చేస్తారు. రోజూ బాగా చేసేవాళ్ళని చూస్తూ, వాళ్ళతో కలిసిచేస్తూఉంటే అదే వచ్చేస్తుంది. కాకపోతే అక్కణ్ణించి వచ్చేశాక్కూడా విధిగా ప్రాక్టీస్ చేయాలి... నాలుగేళ్ళు చాలు కూచిపూడి నేర్చుకోవడానికి తపన ఉన్నవాళ్ళకి. తరవాత ప్రాక్టీస్ చాలు. ... ఆడవాళ్ళు 30-35 ఏళ్ళ వయస్సులో కూడా నేర్చుకోవటం మొదలెట్టచ్చు. మగవాళ్ళకి మాత్రం 18-20 ఏళ్ళు దాటాక (మొదలెట్టటం) కష్టం.

భవిష్యత్ప్రణాళికలు

...క్షీరసాగరమథనం తర్వాత ఇంకో పన్నెండు నృత్యనాటకాలు కంపోజ్ చేశాను. వీటిల్లో హరవిలాసంలో డాన్సులు చాలా బాగా ఉంటాయి. క్షీరసాగరమథనం అంటేకూడా బాగా ఇష్టమే. పాతపద్ధతిలో కంపోజ్ చేశాను. రామాయణం కూడా బాగుంటుంది. ఇంతకుముందు ఎవరూ చేయని పద్ధతిలో చేశాను. ఛండాలిక లాగే ఇంకో సోషల్ థీమ్ ఉన్న బాలే చేయాలని ఉంది.

... కూచిపూడిలో నా స్టైల్ అంటూ ప్రత్యేకంగా ఉందని నేనేం అనుకోను. కూచిపూడి శాస్త్రంలో ఉందే నేను చేస్తున్నాను. చూసేవాళ్ళు మీరు, నేర్చుకొనేవాళ్ళు ఏమన్నా ఇది నా స్టైల్ అని ఏమన్నా గుర్తు పడతారేమో నాకు తెలీదు ... కూచిపూడి నృత్యం మీద ఒక పుస్తకం వ్రాస్తున్నాను. 100 పేజీలదాకా అయింది. దాంట్లో కొంత భాగాన్ని ఏ.ఎస్.రామన్ గారు ఇంగ్లీషులోకి ట్రాన్స్‌లేట్ చేస్తున్నారు ... అకాడమీ భవిష్యత్తు స్థిరంగా ఉండేందుకు ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశాం. ఆ టస్ట్ నిర్వహణకు నిధులు సేకరించాలి.

ఆఖరు మాటలు

... కూచిపూడి చాలామంది బతకటానికే ఉపయోగిస్తున్నారు. కళగా కాక ... కళాకారుడికి డెడికేషన్ ఉండాలి. అది లేకుండా లాభం లేదు. ఏదో నేర్చుకొన్నాం, సంపాదిద్దాం అనుకుంటే లాభం లేదు. తిండి ఉన్నా లేకపోయినా కళ కళకని శాక్రిఫైస్ చేయాలి. సాధన చేయగా చేయగా పర్ఫెక్షన్ వస్తుంది, గుర్తింపు వస్తుంది. కళాకారుడికి గుర్తింపు చాలా అవసరం. ఆ గుర్తింపు ఉన్నప్పుడే ఆ ఆర్టిస్ట్ ఏమైనా చేయగలుగుతాడు.

ఈ కూచిపూడి కళ మనది. ఈ కళ గురించి గర్వపడేహక్కు మనది. దీన్ని నిలబెట్టి, ఉద్ధరించాల్సిన భాధ్యత మనది. ఆ అవగాహన మనందరికీ వస్తేగాని ఈ కళకి ఇంకా మంచిరోజులు రావు.

(ఈ వ్యాసంతో ప్రచురించిన ఫొటోలు శ్రీయుతులు అండవిల్లి సత్యన్నారాయణ, పెమ్మరాజు సూర్యారావు రచించిన "Dr. Vempati: Maestro with a mission" గ్రంథం లోనివి. ప్రకాశకులు: ఎస్.ఎస్.వి. పబ్లిషర్స్, మాచవరం, విజయవాడ వారికి మా కృతజ్ఞతలు.)



Print to PDF without this message by purchasing novaPDF (http://www.novapdf.com/)